కథ

# ప్రేమంటే..!

‘‘ఒక రంగంలో ఎంతో నైపుణ్యం కలిగిన వ్యక్తి. మిగతా అన్ని విషయాలలోనూ అంతే ప్రతిభ కలిగి ఉండాలన్న నియమమేదీ లేదు. అలా ‘లేకపోవడం’ అనేది తప్పు కూడా కాదు. అయితే కొన్నిసార్లు అవసరం వలనో, మరి కొన్నిసార్లు అనుభవాల ద్వారానో మనం వద్దనుకున్నా వాటి గురించి తెల్సిపోతుంటుంది.

**ప్రోగ్రాం నిర్వహించడానికి కారణమేమిటంటే-ఈమధ్యనే జరిగిన యుద్ధంలో తమ ప్రాణాలు కోల్పోయిన వీరజవానుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా ఈ ప్రోగ్రాంకొచ్చే ఫండ్ వెళుతుంది. దేశం కోసం నేనిలా నావంతు కర్తవ్యం నిర్వహించడం ఆనందాన్నిస్తుంది. రామాయణంలోని ఉడతాభక్తిలాటి దన్నమాట.**

అప్పటివరకూ మన జీవితంలో ఎదురవని అనుభవం మనకు ఎదురయితే, ఆ అనుభవం సంతోషాన్నిచ్చేదయితే ‘ఈ విషయంలో ఇంత సంతోషం ఉందా’ అన్పించి ప్రపంచాన్నే జయించినంత గర్వంగా ఎలా ఫీలవుతామో, ఏదైనా విషాద సంఘటన ఎదురైనపుడు దాన్ని ఎదుర్కోగల ‘మానసిక పరిపక్వత’ మనకు రావాలి.

అందుకే-

ఆనందానికి అవధులుండాలి.

బాధలను భరించగలగాలి- అటువంటి వాళ్ళే స్థితప్రజ్ఞులు.

అతడు నన్నే చూస్తున్నాడు.

చాలా సేపట్నుండీ..కన్నార్పకుండా మరీ చూస్తున్నాడు.

బస్టాపులో అంతమంది అమ్మాయిలుంటే అంతమందిలోనూ నన్నొక్కదాన్నే అంత తీవ్రంగా చూడటం ‘మిగిలిన వాళ్లకంటే నేను అందంగా ఉన్నానన్నమాట’ అనే సంతోషం వల్ల కలిగిన గర్వంతోపాటూ అతడి మీద చాలా కోపమొచ్చింది.

అతడి దగ్గరగా వెళ్లి ‘‘ఏంటి! అమ్మాయిల్నెపుడూ చూళ్లేదా? కళ్లింతలు చేసుకుని మరీ చూస్తున్నావ్?’’ అని కడిగి పారేయాలన్న కోపాన్ని కంట్రోల్ చేసుకున్నాను.

కాసేపటి తర్వాత బస్సు వచ్చింది. బిలబిలమంటూ అందరమూ ఎక్కాం.

బస్సెక్కుతూ, ఎక్కాక, దిగుతూ అతడు నావైపే చూస్తుండటాన్ని నేను తల తిప్పకుండానే కంటి కొసచివరల నుండి గమనించాను.

ఒక అందమైన అమ్మాయి కనబడితే చాలు కళ్లార్పడం కూడా మరిచి చూసే మగాళ్ళను ఇప్పటికే చాలా మందిని చూశాన్నేను. ‘చూపులతోనే అనుభవించేయాలన్నంత’ కోరిక కూడా ఉంటుంది ఆ కళ్లల్లో. అయితే అతని చూపుల్లో అలాటి భావాలేమీ లేవు. మామూలుగానే ఉన్నాయి.

నేను దిగాల్సిన బస్టాపులో దిగి ఇంటికెళ్లాను.

ఇంటికెళ్లి అలమరాలో పుస్తకాలు సర్దుతూ ఉంటే..అపుడొచ్చింది ఓ విచిత్రమైనదే అయినా వాస్తవమైన ఆలోచన- అదేంటంటే- బస్టాపులోనూ, ఆ తర్వాత అతడు నన్ను గమనిస్తూనే ఉన్నాడన్న విషయం నాకు తెలుసు. ఆ విషయం నాక్కోపం తెప్పించింది. మరయితే బస్సెక్కుతూ, ఎక్కాక. చివరికి దిగేటపుడు కూడా అతని వైపు నేనెందుకు చూశాను? నన్నింకా గమనిస్తూనే ఉన్నాడా లేదా? అనా లేక అతనివైపు నేను చూస్తే నేనూ తనని గమనిస్తున్నానని అతనిచేత అన్పించేట్లు చేయడం ద్వారా మళ్లీ అతని చూపు నా వైపు మరల్చుకోవాలన్న ఆశ వుందా? అంటే..పైకి కొంచెం కోపంగా అన్పించినా మనసులో ఎక్కడో ఈ విషయం నాకు సంతోషాన్నిచ్చిందన్నమాట..విచిత్రంగా అన్పించింది నాకు.

అంతకంటే చిత్రమైనదేవిటంటే- మగాళ్లకెపుడూ పైకి కన్పించినంత ‘అవేర్‌నెస్’ మనసులో ఉండదు. ఎపుడైనా మా అమ్మాయిలు అబ్బాయిల కళ్లల్లోకి కళ్లు పెట్టి కొద్దిక్షణాలు అలాగే తీక్షణంగా చూస్తే చూపుల తూపులకి తట్టుకోలేక చూసీ చూడనట్లుగా వాళ్లు తల తిప్పేసుకుంటారు. ఎందుకంటే- కళ్లలో కళ్లు పెట్టి ఆడది చూసినంత ధైర్యంగా మగాడు చూడలేడు.

నేనలా అతనివైపు చూశాను.

అతడు తన చూపు తిప్పుకోకపోగా ఇంకా తీక్షణంగా చూడటం మొదలుపెట్టాడు. తప్పదనుకుని ఇక నేనే తల తిప్పుకున్నా.

ఇంకా విచిత్రమైనదేమిటంటే- నేనతని వైపు చూసి ఉండకపోతే అతడు నావైపు చూస్తున్నట్లు నాకెలా తెలిసి ఉండేది అంటే నేనూ అతన్ని గమనించానన్నమాట. అంటే ప్రేమలో పడాలన్న కోరిక నాలోనూ అంతర్గతంగా ఉందన్నమాట.

సినిమాలు చూసీ, నవల్లు చదివి పదహారేళ్లు వచ్చేసరికి ఎవరో ఒకర్ని ప్రేమించేసేయాలన్న కోరిక కలగడం నిజమే అయినా ఇపుడు నేనేమీ పదహారు సంవత్సరాల పడుచునేం కాదు. ఇప్పటికే నా శరీరం వర్ధిల్లడం ప్రారంభించి ఆరేడు సంవత్సరాలు కావస్తుంది.

ఒక ‘వ్యక్తిత్వం’ అంటూ లేనివాళ్లే ఇలా ‘ప్రేమ ఆప్యాయత’లంటూ వెంపర్లాడుతుంటారు. నేనలాటి దాన్ని కాదనుకున్నా నిన్నాళ్లూ. ఇపుడు నా మనసులోని కోరికను ‘ట్రాన్సాక్షనల్ ఎనాలిసిస్’ చేసుకుంటే నేనూ దానికి అతీతమైన దాన్ని కాదని తేలిపోయింది. ప్రేమించడానికి, బడటానికి వయసుతో అసలే మాత్రమూ సంబంధం లేదేమో నన్పించింది.

ఏదో ఆలోచనల్లో ఉండి- ఆరోజు రాత్రి అమ్మయింట్లో-వేన్నీళ్లకోసం గీజర్ పెట్టమంటే కాఫీ కోసమని పాలు కాచాను. టీవీ కట్టేసి అందరూ లేచాక కూడా నేనలాగే చూస్తుండిపోయాను. అమ్మయితే తిట్టింది- రాను రానూ మతిమరుపెక్కువైందని. చెల్లయితే నవ్వింది- నాకు ‘ఏదో’ అయిందని ఆ ‘ఏదో’ ఏవిటన్న సంగతి దానికి తెలిసిపోయిందన్నట్లుగా.

మీరు మగాళ్లయితే- మీక్కాబోయే భార్య అందంగా ఉండాలి. ఆహ్లాదంగా నవ్వాలి. మీరేం చెప్పినా శ్రద్ధగా వింటూ ప్రతి విషయానికీ మిమ్మల్ని సంప్రదించాలనుకుంటారు.

మీరు నాలాగే స్త్రీలయితే- మీ భర్తగా వచ్చేవాళ్లకి అందం, మంచి హోదాగల ఉద్యోగం, అన్ని ఆధునిక వసతులు కలిగిన బంగళా..ఉండాలనీ, వీటన్నిటికంటే ముఖ్యంగా ఆ వచ్చేవాడు (‘వాడు’ అంటున్నందుకు సారీ) మిమ్మల్ని ప్రేమగా చూసుకోవాలనుకుంటారు. మీరనుకున్న గుణాలు కల వ్యక్తి మీకు ఎదురైతే ముందూ వెనుకా ఆలోచించకుండా ముందు మనసిస్తారు. ఆ తర్వాత మిగిలినవి ఇచ్చేస్తారు.

నేనూ అతనికి మనసిచ్చేశాను. మిగిలినవి మాత్రం అసలు ముట్టుకోవడానికే వీల్లేదన్నాను.

సినిమాల్లో చూపించినట్టుగానో, నవల్లో రాసినట్టుగానో కాకుండా మేం ఒకర్నొకరం చూసుకున్న ఆర్నెల్లకి నేనతని ప్రేమలో పడ్డాను. అతనయితే అప్పటికే నా ప్రేమలోపడి పీకలదాకా కూరుకుపోయి ఉన్నాడు.

‘‘ఇద్దరు మూర్ఖుల మధ్య ప్రేమ తొందరగా సాధ్యమవుతుంది. ఒకరు మూర్ఖులు మరొకరు తెలివిగల వాళ్లయితే ఇంకా తొందరగా సాధ్యమవుతుంది. ప్రేమనేది- ఇద్దరు నిష్ణాతుల మధ్య ఎప్పటికీ సాధ్యం కాదు. ఒకరు తమ ప్రేమలో మరొకరి ఉనికినే మరిపించగలిగితే తప్ప.’’

అయితే- పైన చెప్పిందాంట్లో..నేనే తరగతికి చెందుతానో తెలిసేదెలా?

★★★

‘‘చాలా చిన్న వయసులోనే మంచి గాయనిగా పేరు తెచ్చుకున్న మిస్ అనుగీతిక తన గానంతో ఇపుడు మనల్ని లాలించబోతున్నారు’’ అనౌన్సర్ అనౌన్స్ చేసి

వెళ్ళిపోయాక హాలంతా చప్పట్లతో మార్మోగుతుంటే నేను డయాస్ మీదికి అడుగుపెట్టాను. నన్ను చూసి ఇంకా ఎక్కువయ్యాయి చప్పట్లు. అంతమంది ముందూ అలా స్టేజీమీదకొస్తుంటే గర్వంతో ఎద ఉప్పొంగిన మాట నిజమే కానీ నా బాధ్యత ఎలాంటిదో కూడా ఆ చప్పట్లు చూశాకే తెల్సింది.

అన్నట్టు చెప్పడం మరిచా. నాకు 'పాడే' అలవాటుంది. ఏదో ఓ 'కళ' 'హాబీ'గా ఉండాలన్న కోరిక చిన్నప్పట్నుంచీ ఉండటం వల్ల చిన్నసైజు (ప్రస్తుతానికి) గాయనినయ్యాను.

ఆ పాటే నేను బోరు ఫీలవుతున్నప్పుడు నాకు మిత్రురాలైంది.


ఏదొక కొత్త విషయాన్ని తెలుసుకోవాలన్న 'జిజ్ఞాస' నిచ్చింది.

పదిమందిలో ఉన్నపుడు 'నాకంటూ' ఓ ప్రత్యేకత నిచ్చింది.

కాస్తోకూస్తో పేరు సంపాదించి పెట్టింది.

అన్నిటికన్నా ముఖ్యంగా నాకు 'తృప్తి'నిచ్చింది.

ప్రోగ్రాం ఇవ్వడమనేది ఇదే తొలిసారి కాదు గానీ ఇంతమంది పెద్దల సమక్షంలో ఇవ్వడం ఇదే మొదటిసారి. కింద కూర్చున్నవాళ్ళల్లో మొదటి వరుసలో కలెక్టరుగారున్నారు. అసలీ ప్రోగ్రాం నిర్వహించడానికి కారణ మేమిటంటే-ఈమధ్యనే జరిగిన యుద్ధంలో తమ ప్రాణాలు కోల్పోయిన వీరజవానుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా ఈ ప్రోగ్రాం కొచ్చే



ఫండ్ వెళుతుంది. దేశం కోసం నేనిలా నావంతు కర్తవ్యం నిర్వహించడం ఆనందాన్నిస్తుంది. రామాయణంలోని ఉడతాభక్తిలాటి దన్నమాట.

ఆలోచనల నుండి తేరుకుని చూస్తే సంగీత వాద్యకారులందరూ సిద్ధంగా ఉన్నారు.

మైకు ముందు నిలబడి-'మరుగేలరా ఓ రాఘవా..' అని పాడుతుంటే ఇంతకు ముందెప్పుడూ లేని ఏదో తెలీని సిగ్గు కమ్ముకొస్తుంది. ఇంతకు ముందైతే 'సీతారాముణ్ణి' ఊహించుకునేదాన్ని. ఇపుడు 'అనుగీతి కారాముణ్ణి' ఊహించుకుంటున్నా.

సొగసు..చూ..డ..త..ర..మా!

చిరునవ్వులు ముంగురులు-మలి కన్నుల తేటో వర త్యాగరాజ-వందనీయ! ఇటువంటి సొగసు..చూ..డ..త..ర..మా! అని పాడుతున్నప్పుడు కూడా అదే అనుభూతి.

'అతడో' స్తంభం చాటున దాక్కొని రహస్యంగా నన్ను చూస్తున్నట్టూ, దగ్గరగా వచ్చి నా బుగ్గమీద చెయ్యేసి నిమిరినట్టూ..ఒకటే కలవరం.

అయితే ఒక సున్నితమైన అనుభూతిని మా ఆడవాళ్ళు ఆస్వాదించినంత గొప్పగా మగాళ్ళు ఆస్వాదించలేరని నాకప్పుడు తెలీదు. కొంచెం సేపటి తర్వాత తెలిసింది.

కచేరీ ముగిశాక అంతా అభినందనలతో ముంచెత్తారు. ఒకతనయితే షేక్‌హేండిచ్చి ఆటోగ్రాఫ్ తీసుకుని మరీ వెళ్ళాడు.

ఇరవై సంవత్సరాల వయసులో వేరెవరికో ఆటోగ్రాఫ్ ఇవ్వడమంటే..నేను ఉన్నత స్థానంలో ఉన్నట్టు నాకాక్షణం అన్పించింది. నా జీవితంలో గుర్తుంచుకోవాల్సిన రోజుల్లో ఇదీ ఒకటి. ఇంటికెళ్ళాక డైరీలో నోట్ చేసుకోవాలి.

అందరూ వెళుతూంటే అతనొచ్చాడు నా దగ్గరకి. సీరియస్‌గా ఉన్నాడు. అతడూ నా ప్రోగ్రాం చూశాడన్న సంగతి నాకు సంతోషాన్నిచ్చింది. ఆపోజిట్ సెక్స్ నుంచి గుర్తింపు పొందాలన్న ఆశతో అతణ్ణడిగాను.

''ప్రోగ్రాం ఎలా ఉన్నది?'' అని.

''ఇంతకు ముందు నువ్వు షేక్‌హేండిచ్చినతను ఎవరు?'' అన్నాడతను సీరియస్‌గా.

నేనడిగిన ప్రశ్నకి సమాధానం రాకపోగా, అతనేం మాట్లాడుతున్నాడో కొద్దిసేపు నాకర్థంకాలేదు. అయ్యాక ''ఎవరో తెలీదు నా పాట చాలా బాగా నచ్చిందట. షేక్‌హేండిచ్చాడు. ఆటోగ్రాఫ్ కూడా తీసుకున్నాడు'' అన్నాను. అతనేం అడగబోతున్నాడో అర్థంగాక.

''అలా అందరూ నీ పాటని మెచ్చుకుని షేక్‌హేండివ్వమంటే ఇస్తూనే ఉంటావా?'' అన్నాడు.

''చూడు..నువు అమ్మాయివి. ఇపుడు నీ వయసు ఇరవై సంవత్సరాలు. ఇంత చిన్న వయసులో అభిమానం పేరుతో షేక్‌హేండిచ్చుకోవటాలూ, కౌగలించుకోవటాలూ ఉండకూడదు. ఒకవేళ అలా జరిగితే రేపు భర్తగా నాకలాటివన్నీ యిష్టం ఉండవు. దయచేసి ఇంకెప్పుడూ అలా చేయొద్దు''

అది అభ్యర్థనో, ఆర్డరో అర్థంకాలేదు నాకు.


''అవును. నువ్వన్నట్టు నాకిపుడు ఇరవై సంవత్సరాలే. నేనాడపిల్లనే. అమ్మాయిలు షేక్‌హేండివ్వడం మంచిది కాదు. సరే. మరి ఇరవై సంవత్సరాల అబ్బాయైతే అతను అమ్మాయిలకు షేక్‌హేండివ్వొచ్చన్నమాట. అపుడేం తప్పుకాదు. మీ మగాళ్ళు ఎందుకంత సంకుచిత భావాల్తో ఉంటారు? మరో మగాణ్ణి తాకినందువల్లనే శీలం పోతుందని భావిస్తారెందుకు? మీరంతా హిపోక్రటిక్స్. మనసులో ఒకటి పెట్టుకుని పైకి మరొకటి మాట్లాడుతారు. మీకుండే స్నేహితురాళ్ళు మాత్రం అందరితో నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడాలి. అదే మీ భార్యలో, ప్రియురాళ్ళో అలా ఉంటే మళ్ళీ మీకు నచ్చదు. ఆమె పట్ల మీ కంట్రోల్ పోతుందనో, మీకు విలువ ఇవ్వడం లేదనో ఫీలవుతారు.

నైతిక విలువలనేవి ఇద్దరికీ ఉన్నాయి. ఒక పని

**ఎస్. సుబ్బారెడ్డి**

## మిలీనియం చిత్రాలు

### ఫొటోగ్రఫీ పితామహుడు హెన్రీ ఫాక్స్



మనిషి తన చిత్రాన్ని కేవలం అద్దంలోనో, నీటిలోనే, ప్రేయసి కనుపాపల్లోనో కాకుండా కాగితంపైన కూడా చూసుకునేందుకు వీలుగా, చరిత్రను దృశ్యకావ్యంగా మలిచేందుకు ఫొటోగ్రఫీని కనిపెట్టడం ద్వారా వీలయింది. ఈ చిత్రంలో వున్నది ఫొటోగ్రఫీ పితామహుల్లో ఒకరైన విలియం హెన్రీ ఫాక్స్. 1840 సెప్టెంబర్ 23న విలియం హెన్రీ ఫాక్స్ టాల్‌బోట్ తొలిసారిగా క్యాలోటైప్ ప్రాసెస్ ద్వారా ఫొటోను డెవలప్‌చేయగలిగారు. ఆయనే తిరిగి అదే సంవత్సరం అక్టోబర్ 10న మరో కొత్తపద్ధతిలో ప్రాసెస్ చేసి తన భార్య చిత్రాన్ని డెవలప్‌చేయగలిగారు. 1834 నుంచి 1840 వరకు విలియం ఫిల్మ్ ప్రాసెసింగ్‌పై అనేక ప్రయోగాలు చేశారు. ప్రస్తుతం ఈ అపురూప చిత్రాన్ని అమెరికాలోని ఫొటోగ్రఫీ మ్యూజియంలోని చీకటిగదిలో భద్రపరిచారు. తక్కువ కాంతిలోనే దీన్ని సందర్శకులకు చూపించడం ద్వారా కాపాడుకుంటూ వస్తున్నారు.

**-వి.ఎస్.ఎన్.మూర్తి**

మగాడు చేస్తే అడ్డురాని నైతిక విలువలు అదే పని ఆడవాళ్లు చేస్తే ఎలా అడ్డొస్తాయి. కేవలం మరో మగాడితో మాట్లాడటం వలనో, తాకటం వలనో మీ ప్రియురాలుగానీ, భార్యగానీ వాళ్లతో వెళ్లిపోతారేమోననే భయం మీకున్నదీ అంటే మీరందరూ 'డిల్యూషన్స్ ఆఫ్ ఇన్‌ఫెడిలిటీ'తో బాధపడుతున్నారన్నమాట. మీ సమర్థత పట్ల 'అసంతృప్తి'గా ఉన్నారన్నమాట. మీ ప్రేమతో వాళ్లని 'హోల్డ్' చేయగల కేపబిలిటీ మీకు లేదనుకుంటున్నారన్నమాట'' అనిగానీ

''నాకంటూ ఒక అస్తిత్వం, వ్యక్తిత్వమూ ఉన్నాయి. వాటిని కాపాడుకోవడానికే ఈ తపనంతా. ఇదంతా హక్కుల కోసం పోరాటం కాదు. నాకున్న వ్యక్తిత్వాన్ని గుర్తించమని చెప్పడమంతే'' అనిగానీ

''నువ్వింకా నా భర్తవు కాలేదు. కాబోతావు. భార్యాభర్తలయ్యాక ఒకర్నొకరు గౌరవించుకోవాలి. అభిమానించుకోవాలి. వీటన్నిటికంటే ముఖ్యంగా ఒకరిమీద మరొకరికి నమ్మకం ఉండాలి. అంతకంటే ముఖ్యంగా పార్టనర్ పట్ల సర్దుకుపోయే మనస్తత్వం ఉండాలిగానీ నీలా 'అటోక్రటిక్' మనస్తత్వం ఉండకూడదు'' అనిగానీ..ఏదీ అడగలేదు. అడగలేను కూడా. మగాడు మాట్లాడినంత కఠినంగా ఆడదెపుడూ మాట్లాడలేదు. స్త్రీ ఎప్పుడూ బేలే. అబలే.

అయితే ఒక విషయం మాత్రం అతనెంత సీరియస్‌గా అయితే అన్నాడో అంతే సీరియస్‌గా నేనూ అన్నాను. ''నువ్వన్నట్టు నాకిపుడు ఇరవై సంవత్సరాలే. 'గాయని'గా నా కెరీర్ డెవలప్ అయ్యేకొద్దీ నా ప్రపంచం విస్తరిస్తుంటుంది. దానికి ఇది కేవలం తొలిమెట్టు మాత్రమే. ఇలాంటి వెన్నో ముందు ముందు ఇంకా చూడాల్సి రావచ్చు. అవన్నీ చూసి భరించగలిగేటంత ఓర్పు నీకున్నదని నువ్వనుకుంటే మనం కలిసే ఉందాం. లేదంటే మనం అసలు పెళ్లి చేసుకోకపోవడమే మంచిది'' నా నిర్ణయాన్ని పరోక్షంగా చెప్పాను.

''ఆడదానికెపుడూ అణకువే సరైన అందం. నీకు తెలివితేటలు, అందంతో పాటూ గర్వం కూడా కాస్తంత ఉండాల్సిందానికన్నా ఎక్కువే ఉంది'' అన్నాడతను.


ఆ మాట విని అతడు నా గురించి ఆలోచించిన విధానానికి చాలా కోపమొచ్చింది. అయినా కంట్రోల్ చేసుకుంటూ అన్నాను. ''గర్వానికీ, ఆత్మవిశ్వాసానికీ తేడా నీకు సరిగ్గా తెలీదనుకుంటా'' అని.

అంతలో అతడన్నాడు. ''ఈ వాదనలన్నీ ఎందుగ్గానీ రేపు సాయంత్రం పార్క్‌లో కలుసుకుందాం. మన భవిష్యత్తు గురించి రేపక్కడ వివరంగా చర్చించుకుందాం.'' అని నా సమాధానం కోసం ఎదురుచూడకుండా వెళ్లిపోయాడు.

అతనెళ్లిపోతుంటే నాకు బాధేస్తుంది. కాకపోతే- అతడు నన్ను విడిచివెళ్తున్నందుకు కలిగిన బాధ కాదది. అతని గురించి నే వేసుకున్న అంచనా తప్పయినందుకూ, నా ఊహ అంత ఘోరంగా ఫెయిలయినందుకూ. ఇంకోకందుకు కూడా బాధేస్తుంది. ఇద్దరు ప్రేమికులు విడిపోవడానికి కారణం ఇంత చిన్న విషయమైనందుకు. అయితే ఒకందుకు మాత్రం సంతోషంగా ఉంది. ఇంత చిన్న విషయం దగ్గిరే అభిప్రాయ భేదాలొస్తే రేపు పెళ్లయిన తర్వాత కలిసి ఉండటమే కష్టమన్పించవచ్చు. తొందరపడి తప్పటడుగు వేయనందుకు.

నేను రేపక్కడికి వెళ్లను. వెళ్లాల్సిన అవసరం అంతకన్నా లేదు.

కొద్దిసేపటి క్రితం వరకూ అతణ్ణిచూస్తే రాముడు గుర్తొచ్చేవాడు. ఇపుడతను వెళ్లిపోతుంటే రావణుడు గుర్తొచ్చాడు.




కాకి, నెమలి కూడా గుర్తొచ్చాయి.

అవును నిజం..కాకి..కాకిలాగే అరిచి కాకిలాగే ప్రవర్తిస్తుంది. నెమలిలా అందంగా కన్పించడానికి ప్రయత్నించదు. మనసులో ఏదో పెట్టుకుని పైకి అందంగా కన్పించడానికి ప్రయత్నించే ఇలాంటి వాళ్లందరూ నెమల్లాంటివాళ్లే.

ఈ సంఘటనతో ప్రేమపట్ల నాకున్న భ్రమలన్నీ తొలగి నా నిర్దుష్టమైన గమ్యం ఏంటో తెల్సింది.

జీవితాన్ని నిర్మించుకుంటున్న దశలో, వయసులో ఇలాటివన్నీ ఎంత నిరర్థకమైనవో తెలిసింది. దాంతో పాటూ ఓ వాస్తవం కూడా తెల్సింది.

''మానవ సంబంధాలన్నీ ఉల్లిపాయ పొరల్లాంటివి. ఒక్కోపొరా తీసేకొద్దీ అందులోని 'నిజాయితీ' ఎంతో బయటపడుతుందని.

ఇంతకు ముందైతే నేననుకునేదాన్ని ''ఇద్దరు నిష్ణాతుల మధ్య ప్రేమ సాధ్యం కాదు. ఒకరు మూర్ఖులు మరొకరు తెలివిగలవాళ్లయితే వాళ్ల మధ్య తొందరగా సాధ్యమవుతుందని'' ఆ అభిప్రాయం ఈ అనుభవం తర్వాత కొద్దిగా మారింది. ''ఇద్దరు నిష్ణాతుల మధ్యే కాదు. ఒకరు మూర్ఖులు మరొకరు తెలివిగలవాళ్లు అటు ముఖ్యంగా ఆ తెలివిగల వ్యక్తి అమ్మాయైతే వాళ్ల మధ్య కూడా ప్రేమనేది అస్సలు సాధ్యమవదని''

ప్రపంచంలోని ఏ మనిషికైనా అనుభవాన్ని మించిన గురువు మరొకరు దొరకరేమో. పుట్టినప్పటినుండీ ఇప్పటివరకూ నాకు ఏ చదువుగానీ, తల్లిదండ్రులుగానీ, సమాజంగానీ నేర్పని ఒక విషయం ఈ చిన్న అనుభవం నేర్పించింది. ప్రేమంటే ఏమిటో ఖచ్చితమైన అర్థం నాకిపుడు తెలుసు.

''ప్రేమంటే- ఒకర్నొకరు చూసుకున్న నాలుగో నెలలో పుట్టి ఎనిమిదో నెలలో అంతమయ్యేది కాదు. అది నిరంతర ప్రవాహం. మరణం తప్ప మరేదీ ఆపలేనటువంటి ఓ అవగాహన''

☆